(సీరియల్ కథ)

# సుడిగాలిలో...... దీపం!

★



* రచన : శ్రీ బుద్ధిరాజు నరసింహారావు *

(గత సంచిక తరువాయి)

ఆ దుర్ఘటన వార్త విన్న సుందరం ఎంతగానో బాధ పడ్డాడు.

రాగానే దీప పుష్పని చుట్టుకు పోయి బావురు మంది. పుష్పకూడా అక్కయ్య దీన స్థితిని చూసి ఏడ్చింది. ఎలాగో కొద్దిక్షణాలకు తనను నిగ్రహ పరచుకుని ఆమెకి ధైర్యం చెప్పింది. ఏడ్వకక్కయ్యా. అయిపోయిందానికి మనమేం చేయగలం అంతా మన దురదృష్టం".

"నేను నిజంగా దౌర్భాగ్యురాలిని చెల్లీ! నా అంత దురదృష్ట జాతకురాలు మరెక్కడా వుండరేమో".

అటు చంద్రయ్య క్రోధావేశాలతో చిందులు త్రొక్కుతూ సుందరంపై గర్జిస్తున్నాడు. "సుందరం! కళ్ళు తెరచి చూడు ఆ విధవని చూడు, బాబాజీ మాట ని తిరస్కరించినందుకు ఫలితమిదే. నాకది పుట్టినప్పుడే అది దెయ్యమని తెలుసు, దౌర్భాగ్యురాలని తెలుసు".

"అలా అనకు చంద్రం! శాంతంగా ఆలోచించు. ఇదొక ఆకస్మిక సంఘటనని ఎందుకనుకోకూడదు?"

"ఎందుకనుకోవాలి. ఆ కమల్ గూడా ఆధునిక సభ్యతని పిచ్చివాడిలా అరిచేవాడు, అందుకే అలా నేడు ప్రాణాల్ని పోగొట్టుకున్నాడు...అరే సుందరం...మన పూర్వీకులు నియమించిన విధానాలూ ఆచారాలు, నమ్మకాలూ ఊరికనే కాదురా...అంతా కపటం కాదురా! సాధువులూ మహాత్ములంటే అర్థం వుంది. యథార్థముంది."

అతనికెలా నచ్చజెప్పాలో సుందరానికర్థం కావడం లేదు, "నీకెలా చెప్పాలో బోధపడటం లేదు. శాంతంగా ఆలోచించు చంద్రం..."

"ఇకనీ అర్థం పర్థం లేని వెర్రి మాటలు వినేది లేదు అయింది చాలు...ఇప్పుడే బాబా భోలేనాధుని పాదాలు పట్టుకుని క్షమాపణ వేడుకుంటాను...నాకు విముక్తివ్వమని వేడుకుంటాను...నా పాపానికి ప్రాయశ్చిత్తం చేసుకుంటాను. ఇక నువ్వు వెళ్ళొచ్చు."

సుందరం అవమానం జరిగినట్లు బాధ పడ్డాడు. మౌనంగా బయటకు నడిచాడు.

* * *

చంద్రయ్య దీప, పుష్పని వెంటబెట్టుకొని బాబా భోలేనాథుని సన్నిధి చేరాడు.

బాబాజీ ఆసనం మీద ధ్యానం చేసుక్కూర్చుని

దీర్ఘంగా ఆలోచిస్తున్నాడు.

ఎదురుగా ఎందరో ఆడా మగా శిష్యులు సేవకులూ నేలపై కూర్చుని ప్రార్థనలు చేస్తున్నారు.


చంద్రయ్య లోలోన భయపడుతున్నాడు. దీప ముఖం పాలిపోయింది. పెదవులెండిపోయాయి. ఏడ్చిఏడ్చి కళ్ళెరుపెక్కాయి. పుష్ప మాత్రం మౌనంగా వుంది.

ఆ ముగ్గురూ బాబాజీ ఎదురుగా కూర్చున్నారు.

కొద్ది సేపటికి బాబాజీ ధ్యానభంగమైనది. ఆయన కళ్ళు తెరచి బిగ్గరగా, "శ్రీరామచంద్రా...అందరినీ రక్షించు ప్రభు..." అన్నాడు.

శిష్యులంతా అలాగే ఉచ్చరించారు.

అకస్మాత్తుగా బాబాజీ దృష్టి ఎదురుగా కూర్చున్న చంద్రయ్య, దీప, పుష్పలపై పడింది. ఆయనకళ్ళు ఎరుపెక్కాయి, "ఏంరా మూర్ఖుడా...నువ్వు మళ్ళా వచ్చావా ఇంకేమిటి కోరుకోవాలనుకుంటున్నావు. పో అక్షణం పో"




చంద్రయ్య సాష్టాంగం పడి దీనంగా "క్షమించండి బాబాజీ మీరు భగవంతుని అవతారం నేనో సాధారణ మానవుడిని అజ్ఞానిని మూర్ఖుడని నన్ను క్షమించండి!"

"క్షమించడమా నిన్నా? నీలాంటి వాడికి నరకంలో కూడా స్థానం లేదు. చేసిన పాపాలని బ్రాహ్మణుడిని అవమాన పరిచినందుకు అనుభవిస్తున్న నరకయాతనని చూసుకుని ఆనందించు. అదిగో మాటవినక విధవ రూపంగా మారిన నీ కూతురు!"

"బాబాజీ, నే నెంతగానో పశ్చాత్తాప పడుతున్నాను ఇక నన్ను బాధ పెట్టకండి నేను చేసిన పాపాలకి విముక్తివ్వండి నన్ను రక్షించండి!"

"ముక్తిమార్గం కావాలా ఓరే నరుడా, పాపాత్ముడా నేను నీ బాధ చూడలేకపోతున్నాను. ఉండు శ్రీరామ చంద్రుడిని స్మరించుకుని నీ పాపాలకు ప్రాయశ్చిత్తం వేడుకుంటాను" అంటూ బాబాజీ కళ్ళుమూసుకున్నాడు.

చంద్రయ్య అదురుతున్న గుండెలతో మౌనంగా నిరీక్షిస్తున్నాడు. దీప, పుష్ప మౌనంగా కూర్చుని బాబాజీనే తదేకంగా చూస్తున్నారు.

"ఓం ముక్తికి మార్గం! నరుడా రేపు సంధ్యా సమయమున మంచి ముహూర్తముంది ఈ అబలను ఇక్కడ సాగనంపి వెళ్ళు యజ్ఞం చేయించే శక్తినీకు లేదు, దక్షిణ వేయిరూపాయలు తీసుకురా యజ్ఞం పూర్తి చేసే సరికి పదిహేను రోజులు పడుతుంది అన్నిరోజులు ఏకాంత గృహంలో భగవద్భజనలో లీనమై వుండాలి" బాబాజీ కళ్ళు తెరచి ఆజ్ఞాపించాడు.

చంద్రయ్య కృతజ్ఞత చెప్పుకుంటూ, మీరు మహా పురుషులు బాబాజీ అంతా మీ ఆజ్ఞ ప్రకారంగానే జరుగుతుంది.

"ఇంకో విషయం జాగ్రత్తగా విను. ఈ అబలపైనున్న దుష్టగ్రహాలు నీ రెండో కూతురుని కూడా చుట్టుకున్నాయి. అది మరీ ఉగ్రరూపం దాల్చే ముందే మహా శాంతి చేయాలి లేదా వచ్చే కొద్ది నెలల్లోనే పిచ్చిదై మరణిస్తుంది. ఈ రోజే ఆ దుష్ట గ్రహాలకై మహాయజ్ఞం చేయిస్తాను. ఈ అమ్మాయిని ఇక్కడే వదలి వెళ్ళు ఈ మహాయజ్ఞం పూర్తయ్యేసరికి నెల రోజులు పట్టవచ్చు అంతవరకూ ఈ అమ్మాయి ఇక్కడే వుంటుంది. నా శిష్యురాలిగా ఇక పో"

పుష్పంటే చంద్రయ్యకు పంచప్రాణాలు, ఎంతో గారాబంగా, అల్లారు ముద్దుగా పెంచాడు. దుష్టగ్రహాల ప్రభావం ఆమెపై పడిందని తెలుసుకుని బాధపడ్డాడు. అందుకే బాధగా, "మీ ఆజ్ఞ కాదనే శక్తి నాలో లేదు ప్రభూ మీ రెలాగంటే అలాగే!"

"ఇక త్వరగా వెళ్ళు రేపు సంధ్యాసమయమున ఆ అమ్మాయిని కూడా ఇక్కడికి దిగబెట్టు లేదా నీకు ముక్తి మార్గం లేదు గుర్తుంచుకో"

"అంత మాటనకండి భగవాన్ తప్పక దిగబెడ తాను"

దీపతో చంద్రయ్య తిరిగివచ్చాడు.

ఆరోజు రాత్రి అతికష్టంమీద దీప తండ్రితో అన్నది. "నాన్నా నాకేమీ అర్థంకావడం లేదు, మీరిలా బాధ పడేకంటే నాకెక్కడైనా ఉద్యోగం చూసి పెడ్తే నాపైనే ఆధారపడి బ్రతకగలవ కదా?"

"హు! నాపై ఆధారపడి బ్రతక గలను ఏదో గొప్పలా చెప్తున్నావు. నోరు మూసుకుని పడుండు" చంద్రయ్య కఠోరంగా అన్నాడు.

దీప కళ్ళల్లో వరదలా కన్నీరు పొంగి పొరలింది. బొంగురు పోయిన గొంతుకతో అన్నది. "నాన్నా పుట్టినప్పటి నుండి మిమ్మల్ని బాధ పెడుతూనే వున్నాను నేనో దౌర్భాగ్యురాల్ని అసలు నాకు బ్రతికే అర్హత లేదు..."

ఆమె ఏడుపు చూసిన చంద్రయ్య క్రోధావేశంతో వణికి పోయాడు. దీప కారణంగానే తన ముద్దుల బిడ్డ పుష్పకూడా దుష్టగ్రహాల వలలో పడిందని అతనికి దీపపై కోపం, అంతులేని కసి చెలరేగింది. అందుకే ఆవేశంలో గర్జించాడు, "అవును నువ్వు దౌర్భాగ్య రాలివే, పుట్టగానే తల్లి ప్రాణాన్ని మింగేసావు, కట్టుకున్న భర్తని బలి తీసుకున్నావు, నా ముద్దుల బిడ్డ పుష్ప బ్రతుకే మౌతుందో ఆపై వాడికే తెలుసు ఎందుకు నీ బ్రతుకు పుట్టగానే చావలేకపోయావా?"

ఆ వెంటనే తనని నిగ్రహించుకో లేక చరచరా తన గదికి వెళ్ళిపోయాడు చంద్రయ్య.

దీప మంచంపై పడి బోరుమన్నది.

తండ్రి మాటలు హృదయంలో శూలాల్లా గుచ్చు

**WITH BEST COMPLIMENTS FROM :—**

Telegram : "CHUDAMBIKA"

Telephone { Office : 20038, 21668; Mill : 20182

# Sri Ramalinga Choodambikai Mills Limited

**59-A/15, B. S. SUNDARAM ROAD,**

**Post Box No. 65**

**TIRUPUR - 638 601.**

కన్నాయి, "పుట్టగానే చావ లేక పోయావా?"

తను బాల్యావస్థ నుండీ అనుభవించిన కష్టాలు గుర్తుకు రాసాగాయి.

నిజంగా తనో దౌర్భాగ్యురాలు!

పుట్టగానే తల్లి మరణించింది, అందుకు తనా కారకురాలు?

తన జాతకంలో దుష్టగ్రహాల ప్రభావ ముంది. అది తన తప్పేనా?

అన్నీ తన తప్పులే!

"అయితే నేనేం చేయాలి? ఆత్మ హత్య చేసుకోవాలా?" దీప ఆలోచించ సాగింది.

"ఛి! అంత అధైర్యపడి నేను చావుకు శరణు కోరను. ఈ రాత్రే ఈ ఇల్లు వదిలేస్తాను. తండ్రినీ చెల్లెల్నీ వదలి ఎక్కడికో దూరంగా పోతాను. నా దురదృష్టాలు వారినెన్నడూ వేధించకూడదు. ఎక్కడికో దూరంగా వెళ్ళిపోయి నాపై ఆధారపడి బ్రతుకుతాను. ఎలాగైనా సరే!" దీప దృఢంగా నిశ్చయించుకుంది.

తన నిశ్చయం ప్రకారమే ఆ రాత్రి, చుట్టూ నిశ్శబ్దంగా వున్నప్పుడూ, చుట్టూ అంధకారం అలుముకు నున్నప్పుడు దీప ఆ ఇల్లు విడిచింది. తండ్రినీ చెల్లెల్నీ విడిచి దూరంగా ఎక్కడికో ప్రయాణం సాగించింది.

* * *

దీపకి తెలివొచ్చింది. గత జీవితం స్మృతులు మంచులా కరిగిపోయాయి. తలగడా అంతా కన్నీటితో తడిసి పోయింది.

ఆమె ఉలిక్కిపడి చుట్టూ చూసింది.

ఎప్పుడో చీకటి పడిపోయింది. సాయంత్రం ఏడు దాటుంటుంది.

పక్క మీంచిలేచి లైటు వేద్దామనుకుంది. కాని లేవ బుద్ధి కాలేదు. తల నొప్పితో బ్రద్దలౌతున్నట్టుంది. చాలా నీరసంగా అనిపించింది.

అలాగే భారంగా పరుపుపై వాలిపోయింది.

* * *

తనకిప్పటికీ బాగా గుర్తుంది. ఆ రోజు అర్థరాత్రి వేళ తను ఆ ఇల్లు విడిచింది. తొలిరేయి గుర్తుగా కమల్ తనకి కానుకగా ఇచ్చిన బంగారం గొలుసూ, బంగారం గాజులూ తన వద్ద వుంచుకుంది. ఆ రాత్రే ప్రక్కవూరుకి వెళ్ళి ఆ వస్తువులు ఓ కంసాలికి అమ్మివేసింది. మొత్తం ఏడువందలు రూపాయలు దొరికాయి.

ఎక్కడికి వెళ్ళాలో, తన గమ్యస్థానమేటో తెలియదు. రైల్వే స్టేషనికి చేరుకుని ఏ రైలు బయల్దేరడానికి సిద్ధంగా వుందో గాలించింది.

ఆఖరికో మద్రాసు ఎక్స్‌ప్రెస్‌లో ఎక్కి విజయవాడ చేరుకుంది.

ఎక్స్‌ప్రెస్ విజయవాడ స్టేషనులో ఆగగానే అకస్మాత్తుగా ఆమెకు రజనీకాంత్ ఎదురయ్యాడు.

రజనీకాంత్!

ఆమె చిన్ననాటి స్నేహితుడు. శుభాకాంక్షుడు.

చాలా విచిత్రంగా కలుసుకున్నారు వారిద్దరూ.

విజయవాడ స్టేషనులో ఆ కంపార్ట్‌మెంటులో ఎక్కిన రజనీకాంత్ ఆమెకి ఎదురుగా వున్న సీటులో కూర్చున్నాడు.

రెండు మూడు స్టేషన్లు దాటిన తర్వాత ఎదురు సీట్లో కూర్చున్న యువకుడు తనకే తదేకంగా చూస్తున్నాడని దీప పసిగట్టింది.

దీపకి కూడా అతన్నెక్కడో చూసినట్లు గుర్తు రాలేదు.

కొద్ది క్షణాలకి ఆ యువకుడు వుండ బట్టలేక అడిగాడు "ఎక్స్‌క్యూజ్ మీ, మీరు కోప్పడకుండా నా ప్రశ్నకి సమాధాన మిస్తారా?"

"ఏమిటి?"

"మీ పేరు?"

"మీ కనవసరం!"

"పోనీలెండి మీ మెడకి కుడిప్రక్క గీతలా వుంది చూడండి...అది..."

"ఏమిటి మీ అధిక ప్రసంగం" దీప కోపంగా చూసింది.

"నన్నపార్థం చేసుకోకండి ... నా బాల్యావస్థలో నాకో మిత్రురాలుండేది. పాపం ఆమె చిన్ననాటి నుండే బాధలకు గురయింది. వాళ్ళ నాన్నగారు ఆమెని ఎప్పుడూ అసహ్యించుకునే వారు ఓ రోజు ఆయన ఎలక్ట్రిక్ వైరుతో కొడితే ఆమె మెడకి కుడి ప్రక్కగా

గాయమయింది. తర్వాత గాయం మానిపోయినా ఓ గీతలా మచ్చ వుండి పోయింది"

దీప అదిరిపడింది, మీరు మీ పేరు...రజనీ...!

"అవును నా పేరు రజనీకాంత్ మీరు...నువ్వు... నువ్వు దీప..."

"కాంత్ ... నేనే ... దీపని ... అబ్బ ... ఎంతగా మారిపోయావు కాంత్ ..."

నేనెంత అదృష్టవంతుడిని దీపా ఈ రోజు ఇన్నేళ్ళకి కలుసుకో గలిగాను. రజనీకాంత్ ఆనందంతో పొంగి పోతూ అడిగాడు.

"ఇన్నేళ్ళు ఎక్కడున్నావు, ఎలా వున్నావు? కాంత్ ఏంచేస్తున్నావు అసలు నన్ను మరచిపోయి వుంటావనుకున్నాను."

"అదెలా సాధ్యపడుతుంది దీపా! నా చదువులో బిజీగా వున్నాను. అప్పుడప్పుడు నువ్వు గుర్తుకి వస్తే నీకో వుత్తరమైనా వ్రాద్దామనుకున్నాను. కాని మీ రప్పటికి ఆ ఊరు వదలి మరో చోటికి వెళ్ళిపోయి వుంటారని వ్రాయలేదు. ప్రస్తుతం నేను తిరుపతిలో ఓ హైస్కూలులో హిస్టరీ టీచర్‌గా పనిచేస్తున్నాను. అది సరేగాని మీ అమ్మా నాన్నా ఎలాగున్నారు?"

"అమ్మ పోయింది. నాన్నగారూ ఓ చెల్లి వున్నారు."

"ఓ...అలాగా..."

"పిన్నీ బాబయ్యా ఎలాగున్నారు కాంత్?"

"లేరు...ఒంటరిగా మిగిలిపోయాను"

"కాంత్..."

"పోనీలెద్దు ... ఈ మాటలు కేంలే కాని ... ఇంతకీ నీ పెళ్ళయిందా లేదా?"

"పెళ్ళా..." దీప స్వరం వణికింది.

రజనీకాంత్ సానుభూతిని పొంది ఆమెలో దాగి వున్న బాధంతా పొంగి వచ్చింది. ఆ మనోవేదనని నిగ్రహించుకోలేక [illegible] వివరంగా అతనికి చెప్పింది.

అతను అంతావిని ఎంతగానో బాధపడ్డాడు. ఆమెకి నచ్చచెప్పి తనతో తిరుపతి తీసుకెళ్ళాడు.

స్కూలు ప్రిన్సిపాలు జగన్నాధాన్ని కలుసుకొని చివరికలాగో దీపని అక్కడ క్లర్కు కమ్ టైపిస్టుగా పనిప్పించాడు.

• • •

దీప ఆలోచనల నుండి తేరుకుంది,

ఎవరో తలుపు తడుతున్నారు.

తలబరువుగా వుంది.

(సశేషం)




మేము అతినూతనమైన యంత్రసాధనములను అమర్చి అతి సరసముగు, ఆకర్షణీయముగా, నేత్రానందకరమైన, జంకాళాలు మరియు బెడ్ షీట్లను తయారుచేస్తున్నాము. మహాశయులు మాకు చేయూతనిచ్చి అత్యధికముగా ఆర్డరు ఇవ్వగలరని కోరుచున్నాము. మీ ఆర్డరులను వెంటనే గమనించి సప్లై చేయుదుము.

(ఉత్తర ప్రత్యుత్తరాలు ఇంగ్లీషులోనే)

**Sivakumar Industrials**

BHAVANI - 638 301.

P. B. No. 38. Tel.: "JAMAKALAM"

Phone No.: 265